## వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్, మే 23, ప్రభాతవార్త:**
వారం రోజులలో వరి ధాన్యం సేకరణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారుల ు ఆదేశించారు. మంగళవారం వరి ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అన్ని రైస్ మిల్లులకు ట్యాగింగ్ చేసి ప్రతిరోజు కనీసం ఒక రైస్ మిల్లుకు 20 లారీల చొప్పున ధాన్యం అన్ లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన స్టోరేజ్ సదుపాయం కల్పించడం జరుగుతుందని, మిల్లర్లకు నష్టం జరగకుండా బ్రోకెన్ రైస్‌కు ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని అన్నారు. మిల్లర్లు సహకరించ కుంటే వాటిని సీజ్ చేసే అధికారం తహసీల్దార్లకు ఉందన్నారు. రవాణా కాంట్రాక్టర్లు అవసరమైన వాహనాలు ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మిల్లర్ వద్ద హమాలీలు అందు బాటులో ఉంచుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరం మేరకు గన్నీ బ్యాగులు అందించి ధాన్యం పనులను వేగవంతం చేసి వారం రోజులలో పూర్తి చేయాలనని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ,జిల్లా పౌర సరఫరాల అధికారులు రాజేశ్వర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల,డీఆర్‌డీఓ కృష్ణన్,జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి,తహసిల్దార్లు, పాల్గొన్నారు.


## మున్సిపల్ పరిధిలో రీసైకిల్ కేంద్రాల ఏర్పాటు

### -కొడంగల్ పురపాలక కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

**కొడంగల్,మే23,ప్రభాతవార్త :**
కొడంగల్ మున్సిపల్ పరిధిలో మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్‌లో భాగంగా రియూజ్,రెడ్యూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రాలను ఈ నెల 20 నుండి జూన్ 5వ తేది వరకు 15 రోజులపాటు ఉంటాయని వాటి బాధ్యత వార్డుకు సంబంధించిన వార్డు ఆఫీసర్,ఆర్‌పిలది అన్నారు.ఈ కేంద్రాల ఏర్పాటుతో వార్డు ప్రజల ఇంట్లో ఉన్న పాతసామాన్లు,బట్టలు,పుస్తకాలు,సీసాలు,కాగితాలు మొదలైన వాటిని బయటపడవేయకుండా రియూజ్,రెడ్యూజ్,రీసైకిల్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు.వార్డు ఆఫీసర్లు సంబంధిత వార్డు ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు.అవసరమైతే పోస్టర్లు ద్వార ఈ కార్యక్రమంను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు.ఈ కేంద్రాలు ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజలు తీసుకువచ్చే పాతవస్తువులు ఏవైన సరే వార్డు ఆఫీసర్లు తమ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు.నమోదు చేసిన వివరాలను ప్రతిరోజు మేరి లైఫ్ పోర్టల్‌లో అప్డేట్‌చేయాలన్నారు.అ కార్యక్రమంను అందరి సహకారంతో విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మేనేజర్,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన పంచాయతీ రాజ్ శాఖ

**రంగారెడ్డి జిల్లా మే 23, (ప్రభాతవార్త) :**
పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్ వ్యవస్తీకరణకు జీఓ యంఎస్ 18 విడుదల చేయడం చాలా సంతోషకరమని మంగళవారం రంగారెడ్డి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి, అధికారులకు సహితం వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై అవగాహన

**బషీరాబాద్,మే 23,ప్రభాతవార్త:**
పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని బషీరాబాద్ తహశీల్దార్ వెంకటస్వామి,డిటి వీరేష్ బాబు అన్నారు.మంగళవారం నాడు బషీరాబాద్ మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో బిఎల్‌వోల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలు విషయాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మార్పులు చేర్పులు, చిరునామా, ఇంటి లేదా పేరు,వ్యక్తి పేరు మార్పులు వంటివి చేసుకోవటానికి అవకాశం కల్పి స్తున్నట్లు తెలిపారు.మీ గ్రామాలల్లోని అంగన్వాడీ టీచర్‌లకు సంప్రదించాలన్నారు.

## కెసిఆర్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీ వెంటనే చేపట్టాలి

### - వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు, కలెక్టర్ హరీష్, తదితరులు

**రంగారెడ్డి జిల్లా మే 23, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వార వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే 9 జిల్లాలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే హెల్త్ డే రోజున మిగతా 24 జిల్లాల లోని అన్ని శాసన సభ నియోజకవర్గ కేంద్రాల్లో అట్టహాసంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84లక్షల మంది గర్భిణీలకు వీటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని, మాతా శిశు మరణాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ఇదే కోవలో గర్భిణీల్లో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రస్తుతం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమం కూడా మంచి ఫలితాలను అందిస్తుందనే నమ్మకం ఉందని మంత్రి ఆశభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాల ప్రగతి గురించి మంత్రి హరీష్‌రావు జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత భవనాలు మంజూరు చేసినందుకు, వాటి నిర్మాణాలకు అవసరమైన స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన చోట నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా పల్లె దవాఖానాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. కాగా కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 80 పని దినాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కోటిన్నర మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 38,54,000 మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని వివరించారు. ఇందులో 21,46,000 మందికి రీడింగ్ అద్దాలు 17,08,000 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేశామని అన్నారు. ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాకుండా ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలందరి సహకారంతోనే ఇదీ సాధ్యమైందని మంత్రి హర్షం వెలిబుచ్చారు. ఇప్పటికే దాదాపు 90శాతం స్క్రీనింగ్ పూర్తయినందున కంటి వెలుగు శిబిరాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలను వారి వారి సాధారణ విధులు నిర్వహణ నిమిత్తం రిలీవ్ చేయాలని సూచించారు. మిగతా సిబ్బందితో కంటి వెలుగు శిబిరాలను మరింత రెట్టింపు ఉత్సాహంతో నిర్వహిస్తూ లక్ష్యాన్ని పూరినత చేయాలన్నారు. కాగా వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు అందించాలని, పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు వంటి వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు హితవు పలికారు. జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాకు 81 బస్తీ దవాఖానాలు మంజూరు అయినవని, అందులో 59 బస్తీ దవాఖానాలను వినియోగంలోకి తీసుకురావడం జరిగినదని, 6 బస్తీ దవాఖానాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 5బస్తీ దవాఖానాలు పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 71 పల్లె దవాఖానాలు మంజూరు అయినవని, అందులో 35 పల్లె దవాఖానాలకై స్థలాన్ని గుర్తించామని, 36 పల్లె దవాఖానాలకై స్థలాన్ని గుర్తించి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రికి వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, సంబంధిత వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలతో కళకళ



శామీర్‌పేట వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యంను పంపించటానికి లోడ్ చేస్తున్న దృశ్యం



శామీర్‌పేటలోని కేంద్రానికి వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు ట్రాక్టర్స్‌లో వరిధాన్యంను అమ్మకానికి తీసుకవచ్చిన దృశ్యం

### -కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు
### -మరిన్ని ఖాళీ బస్తాల కోసం ఎదురు చూస్తున్న రైతులు
### -అకాల వర్షాలు వచ్చే అవకాశాలు..?
### -భయాందోళనలో రైతాంగం..

**శామీర్‌పేట, మే 23, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతుల నుంచి వచ్చిన వరిధాన్యం బస్తాలతో ఆ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘం (సొసైటీ) పరిధిలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో మొత్తం ఐదు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. శామీర్‌పేట సొసైటీ వారి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు శామీర్‌పేట, అలియాబాద్, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి గ్రామాల్లో పనిచేస్తున్నాయి. దీనిలో వరిధాన్యంను విక్రయించుకోవటానికి రైతులు ట్రాక్టర్స్ ద్వారా వరిధాన్యంను కేంద్రాలకు తీసుకవస్తున్నారు. ఇప్పటికే విక్రయించుకున్న వరిధాన్యంను ప్రభుత్వం సూచించిన చోట్లకు లారీల్లో తరలిస్తున్నారు. అయితే రైతులు పలు గ్రామాల్లో ఖాళీ బస్తాల కోసం వేచి ఎదురు చూస్తున్నారు. అకాల వర్షాలు ఎపుడు పడుతాయో తెలియని పరిస్థితి ఉందని రైతులకు ఖాళీ బస్తాలు అందజేస్తే వరిధాన్యంను పొలాల నుంచి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు త్వరగా తీసుకరావటానికి అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు. విపరీత ఎండలు కొనసాగుతున్నప్పటికీ కొన్ని సార్లు వాతావరణంలో మార్పులు ఏర్పడి అకాలవర్షాలు కురుస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్పష్టం అవుతుంది. వెంటనే రైతుల కోసం ఖాళీ బస్తాలు అందుబాటులో పెట్టాలని కోరుతున్నారు. రైతులు మాత్రం ఖాళీ బస్తాలు త్వరగా అందిస్తే వరిధాన్యంను విక్రయించుకోవటానికి అవకాశం ఉంటుందని కోరుతున్నారు. అకాలవర్షాలు కురిస్తే రైతు చేసిన శ్రమకు నష్టం, వరిధాన్యం తడిసి పోయే పరిస్థితి ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. రైతులకు ఖాళీ బస్తాలు ఇవ్వటానికి సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, సొసైటీ సిఇఓ వి.నర్సింలు, గ్రామాల డైరక్టర్లు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే మంగళవారం వరకు మాత్రం శామీర్‌పేట సొసైటీ పరిధిలో ఐదు కేంద్రాలకు ప్రభుత్వం నుంచి 66వేల ఖాళీ బస్తాలు అందించటం జరిగింది. ఈ ఖాళీ బస్తాలు కేంద్రాలుగ ఉన్న లక్ష్మాపూర్‌కు 11వేలు, కేశవరంకు 11వేలు, ఉద్దెమర్రికి 22వేలు, శామీర్‌పేట్‌కు12వేలు, అలియాబాద్‌కు 10వేలు ఖాళీ బస్తాలు మొత్తం 66వేల బస్తాలు రైతుల కోసం అందించటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలుగ ఉన్న లక్ష్మాపూర్‌కు 6,173బస్తాలు, కేశవరంకు 5,345 బస్తాలు, ఉద్దెమర్రికి 13,192 బస్తాలు, శామీర్‌పేటకు 4,154బస్తాలు, అలియాబాద్‌కు 6,995 బస్తాలు రైతులు ఆయా కేంద్రాల్లో వరిధాన్యంను తీసుకవచ్చి బస్తాలు తెచ్చి రైతులు విక్రయించుకోవటం జరిగిందన్నారు. ఒక బస్తాలో 40కిలోల వరిధాన్యం వస్తుందన్నారు. ఇప్పటి వరకు 35,859బస్తాల వరిధాన్యం అందినట్లు, రైతుల నుంచి 14,343.06క్వింటాళ్లు వరిధాన్యంను కొనుగోలు చేయటం జరిగిందన్నారు. ఓ వైపున ఎండలు..మరో వైపున కొన్ని సార్లు వాతావరణ మార్పులు, అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతాంగం అంతా కూడ భయాంధోళనలో ఉంటున్నట్లు స్పష్టం అవుతుంది. వరి పంట ధాన్యంను రైతులు కోసి వరిధాన్యంను విక్రయించుకోవటానికి ఎండకు ఎక్కడపడితే అక్కడరోడ్లు కూడ వదలకుండ వడ్లను (దాన్యంను) ఎండపోస్తున్నారు. వాటిని రైతులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చే వరకు భయంగా ఉందని ఏ సమయంలో అకాల వర్షాలు పడుతాయోనన్న ఆందోళనలో రైతులు ఉంటున్నారు. వరిధాన్యం ఎండపోసిన రైతులకు ఖాళీ బస్తాలు త్వరగా అందించాలని సొసైటీ వారిని కోరుతున్నారు. అయితే వరిధాన్యం కోసం వెళ్లిన బస్తాలు రైతుల నుంచి వరిధాన్యంతో కేంద్రాలకు వస్తేనే మళ్లీ కొత్తగా ఖాళీ బస్తాలు తెప్పించి రైతులకు ఇచ్చే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వరిపంటలు కోతలో కొన్ని ఉండటం, మరి కొన్ని కోతలు కోసి వడ్లు ఎండపోసినవి ఉండటం, పూర్తి జరిగిన వారు తెచ్చి కేంద్రంలో విక్రయించుకోవటం జరుగుతుందన్నారు. అయితే ప్రభుత్వ సూచనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నట్లు, ఖాళీ బస్తాలు తెప్పించటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సొసైటీ వర్గాల వారు పేర్కొనటం జరుగుతుంది. రైతులు త్వరగా సిద్దంగ ఉన్న వరి ధాన్యంను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి విక్రయించుకోవాలని సూచిస్తున్నారు.

## యూపీఎస్సీ సివిల్స్‌లో షాద్‌నగర్ యువతి ప్రతిభ

### - 384 ర్యాంక్ సాధించడంతో అభినందనల వెల్లువ..

**షాద్‌నగర్, మే 23, (ప్రభాతవార్త) :** దేశ వ్యాప్తంగా యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలు వెల్లడించడంతో షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఇప్పలపల్లి శ్రీశైలం కూతురు సుష్మిత ఆల్ ఇండియా ర్యాంకు 384 సాధించింది. దీంతో స్థానికంగా ఆమెకు, తల్లిదండ్రులకు పద్మశాలి సంఘం నాయకులు,తదితరులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన అమ్మాయి దేశవ్యాప్తం వెలువడిన ర్యాంకులో 384వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు సెలెక్ట్ కావడం చాలా సంతోషకరమైన విషయమని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. సుస్మిత తండ్రి ఓ కిరాణ షాపు వ్యాపారం చేస్తుంటారు.

## ఆశవర్కర్ల పోస్టుల భర్తీకి 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 23, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న పిహెచ్‌సి/ యుపిహెచ్‌సిలలో ఖాళీగ ఉన్న ఆశవర్కర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేదీ వరకు ధరఖాస్తులను స్వీకరించటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని జిహెచ్ఎంసి ఏరియాలో ఉన్న పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో ఖాళీగ ఉన్న 974ఆశవర్కర్ల పోస్టుల భర్తీకి ఆయా పిహెచ్‌సిలో, యుపిహెచ్‌సిలో అర్హత కలిగిన అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు పదవతరగతి పాసై ఉండాలని,ఆపై చదివిన వారు కూడ అర్హులని అన్నారు. 25నుంచి 45సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాల్సి ఉంటుందన్నారు. వివాహం అయిన వారు, వితంతు, డివోర్సు, సపరేట్ ఉన్న వారు అర్హులని అన్నారు. ఆయా జిహెచ్ఎంసి ఏరియాలోని పిహెచ్‌సి,యుపిహెచ్‌సి పరిధిలో ఉన్న బస్తీలలో నివసించు వారు ఆశవర్కర్ల పోస్టులకు అర్హులని అన్నారు.స్థానిక భాషలో అనర్గళంగ మాట్లాడగలగాలని అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి.తెలంగాణ.జిఓవి.ఇన్ అండర్ రిక్రూట్‌మెంట్ టాబ్ నుంచి ధరఖాస్తులు వెబ్‌సైట్ నుంచి పొందాలని సూచించారు. పూర్తి చేసిన ధరఖాస్తులు ఒక ఫోటోతో జత చేసి ఆయా పిహెచ్‌సి,యుపిహెచ్‌సిలలో ఈ నెల23నుంచి 27వ తేదీలోపు ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య ధరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందని ఆయన వివరించారు. అర్హులైన వారు ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## బిడ్డ ఆరోగ్యం, తల్లిసంరక్షణ కోసం కెసిఆర్ న్యూట్రీషన్ కిట్

### -జిల్లాలో పంపిణీకి జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలి
### -మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 23, ప్రభాతవార్త**
బిడ్డ ఆరోగ్యం, తల్లిసంరక్షణ కోసం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం పంపిణీ కోసం జిల్లాలో జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని, పరికరాల నాణ్యతను సమగ్రంగ పరిశీలించాలని గర్భిణీస్త్రీలు అధిక సమయం వేచి చూడకుండ త్వరగా కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నగరం నుంచి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆయన సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. గర్భిణీస్త్రీలలో అనీమియా సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తుందని రాష్ట్ర వ్యాప్తంగ అమలు చేస్తుందన్నారు. పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం, తల్లిసంరక్షణ కోసం కెసిఆర్ న్యూట్రిషన్ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ జిల్లా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగ మరో 15రోజుల పాటు తీవ్రమైన ఎండల ఉండే కారణంగ వడదెబ్బ బారిన ప్రజలు పడకుండ అవసరమైన సూచనలు, సలహాలు అందజేయాలని, ఉపాధి హామీ కార్మికులు పనిచేసే సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డిఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, పాల్గొన్న జిల్లా సంబంధిత అధికారులు

## కాంగ్రెస్‌కు బిజెపి, బిఆర్ఎస్‌లు ఎప్పుడు బద్ధ శత్రువులే

### - టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్
### - బిజెపి,బీఆర్ఎస్‌ల తీరు అవసరం ఉంటే వియ్యం... లేదంటే కయ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్, తదితరులు

**షాద్‌నగర్, మే 23, (ప్రభాతవార్త) :**
రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని వారికి అవసరం ఉంటే వియ్యం లేదంటే కయ్యం అన్నట్లు వ్యవహస్తూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ వీర్లపల్లి శంకర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశంలో కేంద్రం ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలిగే చట్టాలు తీసుకొచ్చారని, ప్రజలందరూ విసుగు చెందారని ఆయన అన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నల్లా చట్టాలను వ్యతిరేకించి పోరాటాలు చేయడం జరిగిందన్నారు. బీజేపీకి కాంగ్రెస్ వ్యతిరేకంగా పోరాడుతుంటే రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం బీజేపీకి మద్దతు తెలిపి తరువాత కొట్లాడారని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా జీఎస్‌టీకి కూడా స్వయనా కేసీఆరే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రధానమంత్రి మోడీని కలిసి తమ మద్దతు తెలిపిన విషయం ప్రజలు మర్చిపోలేదని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలను ప్రజలు వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వారంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నా ప్రభుత్వాల తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కూలిపోయే రోజులు దగ్గరలోనే ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రజాస్వామ్యంగా, రాజ్యాంగబద్ధంగా పాలన కొనసాగించిందని కానీ బీజేపీ సోషల్ మీడియా ద్వారా ఉన్నది లేనట్లు, లేని ఉన్నట్లు చూపించి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో రైతులు, కార్మికులు, ఉద్యోగస్తులు, ఇలా అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ తన సొంత రాష్ట్రం వారికి, కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన ప్రమాదకరంగా మారడంతో రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి అన్ని వర్గాల వారి సమస్యలను తెలుసుకున్నారని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి సమస్య తీరేవిధంగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కర్ణాటకలో గెలుపు కోసం బీజేపీ చేయని ప్రయత్నం లేదని, అయిన అక్కడి ప్రజలు బీజేపీని తిరస్కారించారని ఎద్దేవా చేశారు. గత 40 ఏళ్ల కింద రాజీవ్‌గాంధీ పాలనకు ప్రజలు ఏవిధంగా పట్టం కట్టారో నేడు రాహుల్ గాంధీ పాలనను సహిత ప్రజలు అదేవిధంగా కోరుకుంటున్నారని, అందుకు కర్ణాటక ఎన్నికలే నాంధి అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ విజయం జీర్ణించుకోలేక బండి సంజయ్, బీజేపీ నాయకులు మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని అడుగడుగున ఇబ్బందులు పెడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్న వారికి ఎదురుగా నిలబడి పోరాటాలు చేస్తుంటే బుద్ధిలేని బీజేపీ పార్టీ నాయకులు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అంటు మతి భ్రమించినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీల బోగస్ మాటలను, అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరని అన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వాలేకనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇలా వ్యవహరిస్తున్నారన్నారు.

తెలంగాణ ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, నాయకులు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కంకణం కట్టుకొని పని చేస్తున్నారని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, రఘు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### -బిజెపి, బీఆర్ఎస్‌లతో అభివృద్ధి శూన్యం.. నిధులు ఎక్కడ..?
### -ఘణాపూర్‌లో ఉత్సాహంగా హాత్‌సేహాత్‌జోడోయాత్ర



ఫకీర్‌టెక్యాలో హాత్‌సేహాత్‌జోడోయాత్రలో మేడ్చల్ నియోజకవర్గ సమన్వయకర్తలు హరివర్ధన్‌రెడ్డి, వజ్రేశ్‌యాదవ్‌లకు హారతులు పట్టి తిలకం దిద్దుతున్న మహిళ ప్రత్యూష

**ఘట్‌కేసర్, మే 23, ప్రభాతవార్త:** మోసపూరిత పాలన సాగిస్తున్న బిజెపి, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పలకాలనీ టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. టీపీసీసీ ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం హాత్‌సేహాత్‌జోడోయాత్ర నిర్వహించారు. ఘణాపూర్, పవర్‌గ్రిడ్‌కాలనీ, లింగాపూర్, ఇందిరానగర్, ఫకీర్‌టెక్యా, మోడి బిల్డర్స్‌కాలనీలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు, పాదయాత్రలు చేసి ప్రజలను కలుసుకొని యాత్ర కరపత్రాలను అందజేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీఫ్లోర్‌లీడర్ హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా జోడోయాత్రలో పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని మోసపూరిత సర్కార్లకు వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌పార్టీకి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ సర్పంచులు ఉన్న చోట్ల మంత్రి మల్లారెడ్డి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆయన గ్రామాలలకు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఫకీర్‌టెక్యాలో ప్రత్యూష అనే గిరిజన మహిళ మంగళహారతులతో స్వాగతం పలికి హరివర్ధన్‌రెడ్డి, వజ్రేశ్‌యాదవ్‌లకు తిలకం దిద్దారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్, ఏబ్లాక్ అధ్యక్షులు పోచయ్య, టీపీసీసీ మాజీ కార్యదర్శి కట్టా జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి రవి, ఉపసర్పంచ్ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు మమతగౌడ్, రూప్‌సింగ్‌నాయక్, శామీర్‌పేట్, తూంకుంట, పోచారం, పీర్జాదిగూడల అధ్యక్షులు వైఎస్ గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనిత, మండల అధ్యక్షురాలు అనిత, పోచారం అధ్యక్షురాలు మాధవి, డిపిసీ మాజీ సభ్యులు భానుప్రకాష్, మాజీ ఉపసర్పంచ్ సత్తయ్యగౌడ్, గ్రామ అధ్యక్షులు రాజుగౌడ్, వార్డుసభ్యులు భాస్కర్, పద్మ, శోభ, శ్వేత, కోఆప్షన్ లత, నియోజకవర్గ ఎస్‌టీ సెల్ అధ్యక్షులు సురేశ్‌నాయక్, ఎస్‌సీ సెల్ అధ్యక్షులు బ్లాక్ అధ్యక్షులు మహేశ్, మండల బీసీ సెల్ అధ్యక్షులు రమేశ్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు శివాజీనాయక్, మాజీ వార్డుసభ్యులు లక్ష్మయ్యగౌడ్, శంకర్‌గౌడ్, నర్సింహ్మ, నాయకులు మాధవరెడ్డి, రమేశ్, అంజనేయులు, ఫారూఖ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, కేశవనాథంగౌడ్, వెంకటేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

-నాగారంలో గన్నీ బ్యాగుల కొరత

-ఇబ్బంది పడుతున్న రైతులు



నాగారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భువనేశ్వర్

**ధారూర్ మే23,ప్రభాతవార్త :**
కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు.మంగళవారం ధారూర్ మండలంలోని నాగారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ భువనేశ్వర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలోనే గన్ని బ్యాగులు వస్తాయని దిగులు చెందాల్సిన అవసరం లేదని రైతులకు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరేశం,ఏఈఓ హరి ప్రసాద్ గౌడ్,పిఎసిఎస్ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపిఓ

-పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

-మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లా



నాగారంలో నర్సరీని పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లా

**ధారూర్ మే23,ప్రభాతవార్త :**
గ్రామాలలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లా హెచ్చరించారు. మంగళవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండల పరిధిలోని తరిగోపుల,గురుదోడ్ల నాగారం,గ్రామాలలో నర్సరీ,పారిశుధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మురికి కాల్వలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.నర్సరీలలో మొక్కలను నీరు పట్టాలని,అలాగే ఏవైనా మొక్కలు ఎండిపోతే దాని స్థానంలో నూతన మొక్కలు నాటి సంరక్షించాలని నర్సరీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వినయ్ కుమార్,కారోబార్ ఆనంద్,ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ గౌడ్,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అవుశాపూర్‌లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిన సర్పంచ్ కావేరి



అవుశాపూర్‌లో జేసీబీ యంత్ర సహాయంతో పిచ్చిమొక్కలు తొలగింపజేస్తున్న సర్పంచ్ వై. కావేరి

**ఘట్‌కేసర్ రూరల్, మే 23, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్య వారోత్సవాల మేరకు మండలంలోని అవుశాపూర్ గ్రామంలో మంగళ వారం గ్రామ సర్పంచ్ వై. కావేరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని పలు చోట్ల రోడ్డు ప్రక్కల పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీ యంత్ర సహాయంతో తొలగించారు. రోడ్డుపై అక్కడక్కడ ఉన్న మట్టి కుప్పలను జేసీబీ యంత్ర సహాయంతో తొలగించినట్లు తెలిపారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని రోడ్లన్ని పరిశుభ్రంగా ఉండేందుకు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై. కావేరి, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన చైర్మన్



పోచారం మున్సిపల్ 16,17 వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, మే 23, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ పరిధిలోని నారాపల్లి 16,17 వార్డుల్లో మంగళవారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా చైర్మన్ బి. కొండల్ రెడ్డి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మే 19 వ తేది నుండి మే 27 వరకు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా నాలాల ఊడికతీత, వర్షపు నీరు రోడ్లపై నిల్వఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా చెత్తను తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. కొండల్ రెడ్డితో పాటు కమిషనర్ అర్ర సురేశ్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. అక్రం అలీ, నాయకులు సుర్వీ శ్రీనివాస్ గౌడ్, మోటుపల్లి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈత కొడుతుండగా పిట్స్‌వచ్చి వ్యక్తి మృతి

**మొయినాబాద్, మే 23. ప్రభాతవార్త :**
ఈతకు వెళ్లి ఈదుతుండగా పిట్స్ వచ్చి మరణించిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బొలిమిచెరువు యాదిరెడ్డి (48) ఇంటి దగ్గరే ఉండి జీవనం సాగిస్తుంటాడు. మృతుడి బావ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... మృతుడు యాదిరెడ్డి గత కొంతకాలంగా పిట్స్ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు ఈనెల 22న నాడు ఉదయం 11గంటల సమయంలో పెద్దమంగళారం గ్రామంలోని మల్లన్న గుడి దగ్గర గల మూడు కుంటల దగ్గరికి వెళ్లినాడు. అయితే అదే గ్రామానికి చెందిన శ్రీను అతను సాయంత్రం 6:45 సమయంలో మూడు కుంటల దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ బొలిమి చెరువు యాదిరెడ్డి కుంట సమీపంలో పిట్స్ వచ్చి పడి ఉన్నాడు. అతనను చూసి వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడు. మృతుడి బావ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో మా బామ్మర్థి యాదిరెడ్డి మరణంపై మాకు ఎటువంటి అనుమానాలు లేవని ఫిర్యాదు ఇచ్చినారు. ఇట్టి విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు రుణమాఫీని వెంటనే చేయాలి

## -డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ డిమాండ్

**కడ్తాల్,మే 23 ప్రభాతవార్త :**
బిఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయలేదని, వెంటనే రైతు రుణమాఫీని చేపట్టాలని డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి 3 సార్లు అసెంబ్లీలో ప్రకటించిన, బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు.అరకొరగా రూ 25 వేల రుణాల వరకే రుణమాఫీ చేసిందని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ రైతు రుణమాఫీ చేస్తామని మెనిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా ఊరిస్తూ కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. రైతులు రుణమాఫీ ఎప్పుడవుతుందోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని, బ్యాంకుల్లో వడ్డీకి వడ్డీ జమచేస్తూ రైతులకు రుణభారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం రుణమాఫీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేస్తుందనే ఆశతో, చాలామంది రైతులు పంట రుణాలు చెల్లించలేకపోవడంతో బ్యాంకులో మరింత అప్పుడు అప్పు ఎక్కువైందని, తిరిగి పంట రుణాల కోసం బ్యాంకుల వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకర్లు రైతులపై రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా నాయక్, సర్పంచ్ పాండునాయక్, కో ఆప్షన్ సభ్యులు జాంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్,నాయకులు లక్ష్మయ్య, రాజేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

# 14 శాతం రుసుముతో నిర్మాణాలకు అనుమతులు

## -అక్రమ లేఔట్‌పై చర్యలకు డిమాండ్



చౌదరిగూడ పంచాయతీ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి, కార్యదర్శి గౌతమి

**ఘట్‌కేసర్, మే 23, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణదారుల నుంచి 14 శాతం రుసుము తీసుకొని భవనాలకు అనుమతి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు తీర్మాణం చేశారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామపంచాయతీ సాధారణ సమావేశం మంగళవారం సర్పంచ్ బైరు రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పాలకవర్గం పలు అంశాలపై చర్చించి అవసరమైన తీర్మాణాలను ఆమోదించారు. ఎల్ఆర్ఎస్ కోసం వెయ్యిరుపాయలు చెల్లించిన వారికి, 2020 ఆగష్టు క్రితం రిజిస్ట్రేషన్ జరిగిన దస్తావేజులకు సంబంధించి మార్కెట్ విలువలో 14 శాతం రుసుము తీసుకొని నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని తీర్మాణించారు. వచ్చే వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సర్వేనంబర్ 714లోని అక్రమ లేఔట్‌ను రద్దు చేయాలని ఇటీవల చేసిన తీర్మాణం మేరకు మేడ్చల్ డీపీఓకు, హెచ్ఎండిఏ కమీషనర్‌కు తీర్మాణాలను పంపించి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని వార్డు సభ్యులు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న పెంట్‌హౌస్‌లు, జిప్లస్ 2కు మించిన భవనాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈసమావేశంలో గ్రామకార్యదర్శి గౌతమి, ఉపసర్పంచ్ కుర్ర మహేందర్‌గౌడ్, వార్డు సభ్యులు మంచాల సుధాకర్, మంద స్వామిదాస్, కొంగరి శంకర్‌గౌడ్, రడమల్ల బోజిరెడ్డి, పులకంటి సంయుక్త, కుర్ర స్వాతి, బైరు లక్ష్మణ్‌గౌడ్, బిల్‌కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌లు పాల్గొన్నారు. ఈసమావేశంలో గ్రామకార్యదర్శి

# కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

### కడ్తాల్ మండలంలో..

**కడ్తాల్,మే 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేస్తానని హామీ ఇచ్చిన సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో ఎంపిపి కమ్లిమొత్యనాయక్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు, కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలిసి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి మాట్లాడుతూ గతంలో పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. కెసిఆర్ మాట అంటే మడమ తిప్పని మనిషి అని తెలిపారు. కెసిఆర్ ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కాబట్టి మధ్య తరగతి జీవితాల గురించి తెలుసుకుని వారికి ఇచ్చిన హామీని నెరవేర్చారని తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పదవి క్రమబద్ధీకరణ చేయడానికి స్వాగతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి ఆనంద్, ఎంపిడిఓ రామకృష్ణ, ఎపిఓ మధుసూదనాచారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### కొందుర్గు మండలంలో

**కొందుర్గు, మే 23, (ప్రభాతవార్త) :** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించడంతో మంగళవారం నాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి జూనియర్ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు, రాజేందర్, నిరంజన్, అశోక్‌రెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

### జిల్లెడు చౌదరిగూడ మండలంలో..

**జిల్లెడు చౌదరిగూడ, మే 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయితీ కార్యదర్శులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ గురించి ప్రభుత్వం ప్రకటన చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఓ, ఎంపిఓలకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ధీరజ్, జంగయ్య, మల్లేష్, గణెష్, రవి, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార వాహనానికి ప్రత్యేక పూజలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వీర్లపల్లి శంకర్, తదితరులు

**షాద్‌నగర్, మే 23, (ప్రభాతవార్త) :** టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి నూతన వాహనాన్ని సిద్ధం చేసుకున్నారు. మంగళవారం నూతన ప్రచార వాహనానికి పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి రథాన్ని వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ముమ్మర ప్రచారాన్ని నిర్వహించడానికి వాహనాన్ని సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. వాహన పూజలో 150 మంది కాంగ్రెస్ నాయకులు పాల్గొని వాహనానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్, పీసీసీ సభ్యులు, మండలాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, ఎంపీటీసీలు, సర్పంచులు, సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 18న క్విజ్ పోటీలు

**కడ్తాల్,మే 23 ప్రభాతవార్త :** వచ్చేనెల జూన్ 18న క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధి ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్ పోస్టర్‌ను ఎన్ఎస్‌యుఐ ఆమన్‌గల్ కడ్తాల్, తలకొండపల్లి మూడు మండలాల అధ్యక్షులు కలిసి మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలో విడుదల చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జూన్ 18వ తేదీ నాడు ఉదయం 10 గం.ల నుండి సాయంత్రం 6.గం.ల వరకు ఆన్‌లైన్ క్విజ్ ఎగ్జామ్ పోటీలు నిర్వహించబడును. మూడు మండలాల అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల అధ్యక్షులు షాబుద్దిన్, ఆమన్‌గల్ మండల అధ్యక్షులు ఫరీద్, తలకొండపల్లి మండల అధ్యక్షులు రమేష్‌నాయక్, క్యామ రాజేష్, ఇమ్రాన్‌బాబా, శ్రీకాంత్, పవన్, దర్శన్, లడ్డు, శివ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## శ్రీఆంజనేయ, ధ్వజస్థంబ విగ్రహ ప్రతిష్ఠాపన



సంకేపల్లిగూడలో హోమం నిర్వహిస్తున్న గ్రామస్థులు

**షాబాద్, మే 23. ప్రభాతవార్త :**
మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామంలో శ్రీఆంజనేయ, ధ్వజస్థంబ, నవ గ్రహ, శివలింగ, గణపతి, బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాల ప్రవేశం, ధ్వాజతోరంపూజ, కుంభస్థాపన, వాస్తు హోమము, అగ్నిప్రతిష్ట, మూర్తిహోమాలు, తీర్థప్రసాదగోష్టి, మహాభిషేకము, ధాన్యావాసం, శయ్యాధివాసం, పారాయపాలు, జీవతత్వాన్యాసప్రతిష్ట, హోమాలు, నవగ్రహయంత్ర ఆంజనేయ, శివలింగ, గణపతి ప్రతిష్ట తదితర కార్యక్రమాలు వేదపండితులు కార్యక్రమాలు చేయించారు. బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్థంబ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి దర్శన్, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, రంగారెడ్డి, బుచ్చయ్య, నర్సింలు, శ్రీశైలం, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కొన్న భూమిపై భూవ్యాపారస్తుల కన్ను

-తప్పుడు డాక్యుమెంట్లతో ఇబ్బంది పెడుతున్నారు

**షాబాద్, మే 23. ప్రభాతవార్త :**
కష్టపడి సంపాధించిన డబ్బుతో కొనుగోలు చేసిన భూమిపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమను ఇబ్బంది పెడుతున్నారని పట్టాదారులు ఆరోపిస్తున్నారు. షాబాద్ మండలం మన్మరి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.377లో నగరానికి చెందిన కొందరూ గత 16సంవత్సరాల క్రితం భూమిని కొనుగోలు చేశారు. కొనుగోలు సమయంలోనే అన్ని భూరికార్డులు పరిశీలించి అన్ని సరిగ్గా ఉండడంతో 2007లో శివకుమార్, బిందుశ్రీ, శ్రవణ్‌కుమార్, ప్రభాకర్‌శర్మ, శ్రీకాంత్, విజయ్‌కుమార్, దేవిభాయ్,వందన, సంధ్యాకుమారి, జయలక్ష్మి, సింహాద్రి, పాపిరెడ్డి తదితర 14 మంది 17ఎకరాలను రైతుల నుండి కొనుగోలు చేశారు. అప్పటి నుండి ఈ భూమిని సాగు చేసుకుంటూ వస్తున్నారు. ఈమధ్య కొందరు నాయకులు ఈ భూమిపై తమకు(పిటి) కౌలు హక్కుదారులమంటూ తమను భూమి సాగు చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన తగిన ఫలితం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. అన్ని చట్టం ప్రకారం డాక్యుమెంట్లతో సామాన్యులు, నిరుపేదలు భూములు కొనుగోలు చేసిన, భూమి వ్యాపారులు పెట్టే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## నఖిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



లాల్‌పహాడ్ ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ కృష్ణమోహన్

**జిల్లెడు చౌదరిగూడ, మే 23,(ప్రభాతవార్త):**
ఫర్టిలైజర్ షాపులలో నఖిలి విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఏఓ కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్‌లో ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులలో గల రికార్డులను పరిశీలించారు. నఖిలి విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు ఉన్నారు.

## ఆర్ఆర్ఆర్ సెంటర్లను ప్రారంభించిన చైర్మన్ కొండల్ రెడ్డి



పోచారం మున్సిపల్ 13, 18 వార్డుల్లో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించిన చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, మే 23, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ పరిధిలోని 13, 18 వార్డుల్లో స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రెయ్యూస్, రీసైక్లింగ్ సెంటర్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి వెలువడే వస్తువులను పున ర్వియోగం చేయగలిగే వాటిని సేకరించి తిరిగి ఉపయోగపడే విధంగా రూపొందించనున్నట్లు తెలిపారు. ట్రిబుల్ ఆర్ సెంటర్లలో పాత బట్టలు, బెడ్‌షీ ట్స్, పాత పుస్తకాలు, పాత బొమ్మలు, ప్లాస్టిక్ బొమ్మలు వాటివంటిని మా ర్పిడి చేసి తిరిగి వినియోగంలోకి వచ్చే విధంగా చేస్తారని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ సెంటర్లను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. కొండల్ రెడ్డి, కమిషనర్ అర్ర సురేశ్, నాయకులు బి. జగన్‌మో హన్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి, మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన వీఆర్ఏల సంఘం నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వీఆర్ఏ సంఘం నాయకులు.

**కొడంగల్,మే23,ప్రభాతవార్త :**
కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని వీఆర్ఏల సంఘం నాయకులు క్యాంపు కార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూల దండతోసన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ క్యాబినేట్ సమావేశంలో పే స్కేల్ అమలు చేస్తున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23వేల మంది వీఆర్ఏల తరపున ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ గోపాల్,శ్రీనివాస్, సంధ్యారాణి,ఆంజనేయులు, మోహన్, నరసింహులు,ప్రవీణ్‌బాబు,వెంకటయ్య,రమేష్,తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా మారెమ్మ..సేవాలాల్ మహారాజ్ పల్లకిసేవ



పల్లకి సేవలో పాల్గోన్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్,మే23,ప్రభాతవార్త :**
బొంరాస్‌పేట్ మండలం బొట్లోనితాండ గ్రామపంచాయతీలో మారెమ్మ మత సేవాలల్ మమరాజ్ పల్లకిసేవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గోన్నారు.పల్లకిసేవతోపాటు అయన ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తాండ ప్రజలు బోనాలు, ఆట పాటలు,ఉరేగింపుతో పండుగను ఘనంగా నిర్వహించారు.కార్యక్ర మంలో పార్టీ అధ్యక్షులు యాదగిరి,ఎంపిటీసి తిరుపతయ్య,మున్సిపల్ కౌన్సిలర్ మధుసుధన్ యాదవ్,పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి,డైరెక్టర్ సోమ్‌నాథ్,యూత్ నాయకులు మహేష్,మల్లేషంగౌడ్, నేహ్రూనాయక్, చందర్ నాయక్,శంకర్‌నాయక్,మోతిబాయి,తాండ ప్రజలు,యువకులు పాల్గోన్నారు.

## ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు సాయిచరణ్ రాజీనామా

**ఘట్‌కేసర్, మే 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డి తన పదవికి, కాంగ్రెస్‌పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈమేరకు తన రాజీనామా పత్రాన్ని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాహుల్‌యాదవ్‌లను పంపించారు. సమాజంలో మార్పురావాలన్న దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చానని, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పరిపాలన దక్షత, కష్టపడే తత్వం తనను ఆకర్షించాయని, చదువుకున్న యువకునికి అధికారం వస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని కాంగ్రెస్‌లో గుర్తించినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో తాను కాంగ్రెస్‌పార్టీలో కొనసాగలేక పార్టీ నుంచి తప్పుకుంటున్నానని తనకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మున్సిపల్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## వ్యవసాయ భావిలో పడి మహిళ మృతి

**మొయినాబాద్, మే 23, ప్రభాతవార్త :** మతిస్దిమితం లేని ఓ మహిళ వ్యవసాయ భావిలో పడి మరణించిన సంఘటన మొయినాబాద్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కుమ్మరి రాఘవేందర్, మృత్తిరాలు కుమారుడు, జీవన్‌గూడ గ్రామం ఎన్కేపల్లి, మొయినాబాద్ మండలానికి చెందిన వ్యక్తి ఇచ్చిన పిర్యాదు మేరకు వారి అమ్మగారైన కుమ్మరి కలమ్మ,య(50) భర్త లేట్ కృష్ణయ్య, వృత్తి గృహిణి, వారి కుమారుడు, తెలిపిన వివరాల ప్రకారం వారి నాన్నాగారు, గత 7 సంవత్సరాల క్రితం మరణించినాడని, అప్పటి నుండి, వారి అమ్మ కలమ్మ, మతిస్థిమితం కోల్పోయిందని, చాల ఆసుపత్రులు తిరిగి ట్రిట్‌మెంట్ చేయించామని, ఎర్రగడ్డ ఆసుపత్రిలో 4 సంవత్సరాలు ఉంచి చికిత్స చేయించిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు, గతంలో అప్పుడప్పుడు ఇంట్లో నుండి ఎవరికి చెప్పకుండా, మూడు,నాలుగు రోజులు పాటు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేదన్నారు,23న అందాజ ఉదయం, 7గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి పోయింది, ఎప్పటిలాగే తిరిగివస్తుందని, అనుకున్నామన్నారు,మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో మా అమ్మ మా గ్రామ పరిధిలోని వ్యవ సాయ భూమిలోని నీళ్ల భావిలో పడి చనిపోయిందని, మా గ్రామానికి చెం దిన వ్యక్తులు ఫోన్ చేసి చెప్పినాడు, మా అమ్మ మరణం పై మాకు ఎలాం టి అనుమానాలు, ఎవరిపై లేదని ఫిర్యాదు ఇచ్చినాడు, ఇట్టి విషయం పై పోలీసులు కేసు నమోదుచేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 29 నుంచి ఉచిత మగ్గం వర్క్స్ శిక్షణ తరగతులు



మగ్గం వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

**రంగారెడ్డిజిల్లా మే 23, (ప్రభాతవార్త) :**
యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఈనెల 29 నుంచి మగ్గం వర్క్‌లో శిక్షణ తరగతులు ప్రారంభం కాబోతున్నాయని నిర్వహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు 30రోజుల పాటు రంగారెడ్డి జిల్లా ముచింతల్ స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆవరణలో కొనసాగుతాయని, 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో తమను సంప్రదించాలని వారు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన సౌకర్యం, వసతి, యూనిఫారం, టూల్ కిట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## సమిష్టి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం : ఎంపిపి మల్లేశం



సమావేశంలో మట్లాడుతున్న ఎంపిపి మల్లేశం, పూడూరు సర్పంచ్ నవ్యా నర్సింహ్మారెడ్డి, ఎంఇఓ హరిశ్చంద్ర తదితరులు

**పూడూరు, మే 23, ప్రభాతవార్త :**
ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషిచేస్తే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమౌతుందని ఎంపిపి పూడుగుర్తి మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం బాలలహక్కు వారిని పాఠశాలల్లో విద్యను అభ్యసించే విధంగా ప్రోత్సహించాలని వివరించారు. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా వెంటనే సమాచారం అందించాలని కోరారు. అందరి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి మేఘమాల, సర్పంచులు నవ్యానర్సింహ్మారెడ్డి, శ్రీధర్‌గుప్తా, ఆంజనేయులు, పాపయ్య, ఎంపిటిసి సల్మాబేగం, సిడిపిఓ వెంకటేశ్వరమ్మ, ఎంఇఓ హరిశ్చంద్ర, ఎంపిఓ, ఎపిఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్సమ్మ, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, అండాలు, పుష్ప, అంజమ్మ, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి భరోసా**



కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ నాయకులను బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆపార్టీ రాష్ట్ర నాయకుడు కే అనీల్‌రెడ్డి, ఎంపిపి మల్లేశం, అజీం తదితరులు

**పూడూరు, మే 23, ప్రభాతవార్త :**
పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తమ కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనీల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ గ్రామ శివారులో ఉన్న అజీం వ్యవసాయ క్షేత్రంలో చింతలపల్లి గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య, కూని నర్సింలు, కూని జంగయ్య, కుర్వ మల్లేష్, పిబి మల్లేష్‌లతో పాటు సుమారు 60 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అనీల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల పార్టీ అద్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎంపిపి మల్లేశం, జిల్లా పార్టీ సీనియర్ నాయకులు అజీంలతో కలిసి పార్టీలో చేరిన నాయకులకు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కొప్పుల అనీల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీనుండి భారీ ఎత్తున తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వచ్చేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అందుకు అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండి అజారుద్ధీన్, మండల పార్టీ నాయకులు వినయ్‌రెడ్డి, అమీర్‌అలీ, రయీస్‌ఖాన్, చింతల్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ అద్యక్షుడు జంగయ్య, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తకుప్పలను తొలగించాలి

**-డిఎల్‌పిఓ శంకర్ నాయక్**

**పెద్దేముల్, మే 23, ప్రభాతవార్త:**
రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని డిఎల్‌పిఓ శంకర్‌నాయక్ ఆదేశించారు. పారిశుద్దంలో బాగంగా మంగళవారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్. నాగులపల్లి, తట్టెపల్లి, జైరాంతాండా, ఓంలనాయక్‌తాండా తదితర గ్రామాలలో డిఎల్‌పిఓ సందర్శించారు. ఈ సందర్బంగా డిఎల్‌పిఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ కూడా చెత్తచెదారం కనిపించకుండా చూడాలని అన్నారు. మురుగుకాలువలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉంచాలని అన్నారు. గ్రామాల నడిమద్యన ఉన్న పెంటగుంతలను వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిఓ సుష్మ, సర్పంచ్ శ్రావన్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిఎల్‌పిఓ శంకర్ నాయక్

# రాష్ట్ర అవతరణ వేడుకల్లో కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలి

**-వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు**

**వికారాబాద్, మే 23, ప్రభాతవార్త:**
రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రారంభం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు రాష్ట్ర స్థాయి వైద్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లాలలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, గర్భిణీ మహిళలకు అనీమియా సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తుందని, మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసామని, ప్రస్తుతం మిగిలిన 24 జిల్లాలకు విస్తరిస్తున్నామని మంత్రి అన్నారు. పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం, తల్లి సంరక్షణ కోసం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ఉపయోగపడుతుందని, ప్రతి గర్భిణీకి 2 సార్లు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6.84 లక్షల మంది గర్భిణీలు ఉంటారని, 2వ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్, 3వ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ సమయంలో 2 సార్లు గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ ఇస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 111 కేంద్రాల ు గుర్తించామని, అక్కడ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 2038 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌లను మంజూరు చేశామని, 422 సబ్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, మరో 177 పనులు చివరి దశలో ఉన్నాయని, 610 నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో 63 సబ్ సెంటర్ భవనాలకు భూకేటాయింపులు జరగలేదని, వీటిపై కలెక్టర్‌లు శ్రద్ధ వహించి గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండే భూములను ఎంపిక చేసి సబ్ సెంటర్ల కేటాయించాలని మంత్రి సూచించారు. సబ్ సెంటర్‌లలో నిర్మాణం కోసం ముందస్తుగా జిల్లా ప్రజా పరిషత్తులకు, పట్టణ ప్రాం తాల్లో మున్సిపాలిటీలకు నిధులను విడుదల చేశామని, వారం రోజులలో మరో 400 కోట్ల నిధులు విడుదల చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సబ్ సెంటర్ భవన నిర్మాణానికి నిధుల సమస్య లేనందున త్వరితగతిన 766 సబ్ సెంటర్ల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అన్నారు. జిల్లాలకు నూతనంగా మం జూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, బస్తీ, పల్లె దవాఖానాలు, డయాగ్నోస్టిక్ హబ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3208 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణ యించిందని, వీటిలో ఇప్పటికే 2995 మైల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమిం చామని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 211 పోస్టుల ు జిల్లా స్థాయిలో భర్తీ చేయాలని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.5 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21.4 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్, 17.08 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. సిపిఆర్ శిక్షణ పై వైద్యాధికారులు శ్రద్ధ వహించాలని, నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 15 రోజుల పాటు తీవ్రమైన ఎండలు ఉంటాయ ని, ఎండల కారణంగా వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా అవసరమైన సూచ నలు సలహాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

# రా రైస్ మిల్లర్‌లకు గుది బండగా మారిన వరి ధాన్యం సేకరణ

**-ధాన్యం సేకరణకు నిరాకరిస్తే మిల్లులను సీజ్ చేస్తామంటున్న అధికారులు?**

**-నూకలతో భారీగా నష్టాలొస్తాయంటున్న మిల్లర్‌ల యజమానులు**

**యాలాల మే 23, ప్రభాతవార్త :**
రబీ సీజన్లో వరి ధాన్యం సేకరణ రా రైస్ మిల్లర్స్‌లకు గుది బండలా మారింది. ప్రభుత్వం మద్దతు ధరతో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యాన్ని మిల్లర్‌లకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే ఈ సీజన్‌లో ధాన్యాన్ని సేకరించేందుకు మిల్లర్‌లు వెనుకంజ వేస్తున్నారు. రబీ సీజన్ వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే నూకల శాతం భారిగా వస్తాయని మిల్లర్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూకల పర్సెంటేజీ తమను నిండుగా ముంచే ప్రమాదం ఉందని మిల్లర్లు భయపడుతున్నారు. లాభం రాకున్నా పర్వాలేదు కనీసం నష్టం రాకుండా అధికారులు చర్యలు చేపడితే ధాన్యం సేకరణకు అభ్యంతరం లేదని మిల్లర్‌లు పేర్కొంటున్నారు. నష్టాలతో తమ ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్తితి వచ్చే ప్రమాదం ఉందని భయపడడం గమనార్హం. అధికారులు నూకల శాతంపై స్పష్టమైన లిఖిత పూర్వక హామీ ఇస్తేనే ధాన్యం సేకరణకు ముందుకు వస్తామని మిల్లర్లు భీష్మించుకున్నట్లు తెలిసింది. మరో పక్క అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ధాన్యం సేకరణకు నిరాకరించే మిల్లర్‌లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం నిరాకరించే రా రైస్ మిల్లులను సీజ్ చేయాల్సి వస్తోందని అధికారులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ధాన్యం సేకరణ కోసం జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాలతో పాటు యాలాల మండలంలోని ఆరు రా రైస్ మిల్లులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. రబీ సీజన్‌లో పండే వరి ధాన్యాన్ని రా రైస్ మిల్‌లో మిల్లింగ్ చేస్తే భారిగా నూకలు వచ్చే ఆస్కారం ఉంది. క్వింటాలు వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే సుమారు 30 నుంచి 40 శాతం వరకు నూకలు వచ్చే అవకాశం ఉంది. ఈ సీజన్ ధాన్యాన్ని బలవంతంగా రా రైస్ మిల్‌లకు అప్పగిస్తే భారిగా నష్టాలు వస్తాయనే వాదన వినిపిస్తోంది. కాగా కస్టమ్ మిల్లింగ్ నిబంధనల ప్రకారం క్వింటాలు ధాన్యానికి గాను 67 కిలోల బియ్యాన్ని మిల్లర్‌లు అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలో రా రైస్ మిల్లుల్లో ఈ ప్రక్రియ సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. తెలంగాణలో రెండు సీజన్‌లలో వాతావరణ పరిస్థితుల వల్ల ధాన్యాన్ని వేర్వేరు పద్దతుల్లో మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందనే విషయం తెలిసిందే. అయినప్పటికీ బాయిల్డ్ రైస్ మిల్లులకు అప్పగించాల్సి ధాన్యాన్ని రా రైస్ మిల్లులకు అప్పగించడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. రైతుల కోసం తాము ధాన్యం సేకరణకు ముందుకొస్తామని, కానీ నూకల విషయంలో సంబంధిత అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని మిల్లర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతే కాకుండా క్వింటాలుకు గాను రూ.15 ఇచ్చే వర్కింగ్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని పలు రైస్ మిల్లర్లు కోరుతున్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఈ డబ్బులు విడుదల కాలేదని, తమకు అందలేవని మిల్లర్లు పేర్కొంటున్నారు. రా రైస్ మిల్‌లో నేరుగా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే ముడి బియ్యం, లేదా రా రైస్ వస్తాయి. అదే ధాన్యాన్ని నిర్ణీత ఉష్ణోగ్రతల వద్ద ఉడికించి మరపట్టిస్తే బయాల్డ్ రైస్‌గా మారుతాయి. ఇదిలా ఉండగా రైస్ మిల్లులనుంచి బియ్యాన్ని గోదాంలకు అప్పగించడం మిల్లర్‌లకు తలకు మించిన భారంగా మారింది. గోదాంల వద్దకు పంపిన బియ్యాన్ని కూలీలు(లేబర్) అందుబాటులో లేకపోవడంతో సకాలంలో దించడంలేదు. దీంతో ఒక్కోసారి లోడ్‌తో ఉన్న లారీలు మూడు నాలుగు రోజులు గోదాం ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులున్నాయి. దీంతో మిల్లర్లకు అదనంగా లారీ కిరాయిల భారాన్ని భరిస్తున్నాట్లు తెలిసింది. అంతేకాకుండా మిల్లింగ్ చేసిన బియ్యంలో ఏ మాత్రం నాసిరకంగా ఉన్నా సదరు అధికారులు లారీ లోడ్‌ను రిజెక్ట్ చేయడంతో మళ్లీ మిల్లింగ్ చేసి గోదాంకు పంపించడం వల్ల ఒక్కో లారీకీ అదనపు భారం పడుతున్నట్లు మిల్లర్లు వాపోతున్నారు. రా రైస్ మిల్లుల వద్ద ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరైన సౌకర్యాలు లేవు. వర్షా కాలం ముంచుకొచ్చే వేల ధాన్యం నిల్వలకు గోదాంల సౌకర్యం లేదు. ధాన్యం తడవకుండా నిల్వలపై ప్లాస్టిక్ కవర్స్ లేదా తాడిపత్రిలు సమకూర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ధాన్యం సేకరణ నూకలతో ముడిపడి ఉండడంపై అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో అధికారులు మిల్లర్లతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేస్తే వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తవుతోంది. రానున్న వర్షాకాలన్ని పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కార మార్గం చూపితే రైతులతో పాటు మిల్లర్లుకు సమస్య తీరుతోందని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

## 4వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం




మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః**
మేడ్చల్ మున్సిపాలిటిలోని 4వ వార్డులో మంగళవారం కౌన్సిలర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చెత్తను శుభ్రం చేయించి, మట్టి దిబ్బలను, ముళ్ల చెట్లను తొలగించామని కౌన్సిలర్ తెలిపారు. అదే విదంగా చెత్తను ఆరు బయట పారవేయకుండా, మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలని ప్రజలకు వివరించినట్లు ఆయన పేర్కొన్నాడు. దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశం

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః**
గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు, మ్యాన్ హోల్ రిపేర్లు, బోర్ మోటార్ల నిర్వహణ, రిపేర్లు తదితర వాటితో పాఉ పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన క్రేన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డబిల్‌పూర్‌కు బయోడైవర్సిటీ అవార్డు

**-అవార్డు అందుకోవడం సంతోషం : సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి**



బయో డైవర్సి అవార్డును అందుకున్న డబిల్‌పూర్ గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః** పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించినందుకు గాను డబిల్‌పూర్ గ్రామానికి మేడ్చల్ జిల్లాలోనె ఉత్తమ బయోడైవర్సిటీ అవార్డు దక్కింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యుడు రామోదర్‌రెడ్డిలు అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేశంలోనె ఎక్కడా లేని విదంగా రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో పచ్చదనం పెంపొందిందని అందరికి ఆదర్శంగా మారిందని అన్నారు. పల్లె ప్రగతి, ప్రకృతి వనాలతో ఏ పల్లె చూసినా పచ్చదనంతో ఉట్టి పడుతున్నాయని అన్నారు. తమ గ్రామంలో కూడ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది కృషితోనె పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ చేసుకోగలిగామని, దీంతో మాకు ఈ అవార్డు దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. అందుకు కృషి ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలియజేశారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

**బషీరాబాద్, మే 23, ప్రభాతవార్త:**
మహిళ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నాడు బషీరాబాద్ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చట్టం ప్రకారం బాలికలు 18 సంవత్సరాల నుండి 21 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలన్నారు. బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేసేల గ్రామాలల్లో అవగాహన కల్పించాలని సమావేశంలో పంచాయతీ కార్యదర్శులకు, అంగన్వాడి టీచర్‌లకు కోరారు. బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామాలల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోకూడదని విద్యార్థులు చదువుకునేందుకు అధికారుల ప్రోత్సాహం ఉంటుందన్నారు. మరింత వివరాలకోసం జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ తహశీల్దార్ వెంకటస్వామి, ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి, ఐసిడిఎస్ అధికారిణి జయశ్రీ, వికారాబాద్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి నరేష్ కుమార్, ఇంచార్జి సిడిపివో నిర్మల, ఎంఈవో సుధాకర్ రెడ్డి, చైల్డ్‌లైన్ ప్రతినిధి నర్సిములు, సూపరిండెంట్ విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.



# తండ్రేమో నీళ్లు దోచుకెళ్తే కూతురు ముసలి కన్నీరా?

**- వైఎస్ షర్మిల వ్యాఖ్యాలపై షాద్‌నగర్ బీఆర్ఎస్ నేతలు ఫైర్**

**- పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా బీజేపీ బాధ్యత కాదా...?**

**- పదిసార్లు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెడితే ఏం చేశారు..?**

**- ప్రతిపక్షాల విమర్శలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**షాద్‌నగర్, మే 23, (ప్రభాతవార్త) :**
తండ్రేమో నీళ్లను దోచుకెళ్తే... కూతురు పాలమూరు రంగారెడిడ ఎత్తిపోతల పథకం గురించి ముసలి కన్నీరు కారనచడం వైఎస్ షర్మిల వంతైందని, అదేవిధంగా అధికారంలో ఉన్న బీజేపీ తన పరపతిని మరిచి మాట్లాడుతున్నారని, మరోవైపు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పది సార్లు పట్టం కడితే ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలంటూ కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ తెలంగాణ పార్టీల విమర్శలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎదురు దాడికి దిగారు. షాద్‌నగర్‌లో జరిగిన మహధర్నా సందర్భంగా వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యాలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, మన్నె నారాయణ, ఎమ్మె సత్యం, రామకృష్ణ, శ్రీశైలంగౌడ్ తదితరులు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు వద్ద రెగ్యులేటర్ ద్వారా నాలుగు తూములకు 10 తూములు నిర్మించి ఆంధ్రకు నీళ్ల తరలించుకుపోయిన సంఘటనను గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పతినత కోసం మరో తూము నిర్మించి జిల్లాకు మొట్టమొదట అన్యాయం చేసింది మీ తండ్రి వైఎస్ కాదా అని వారు ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో ప్రారంభించారని చెబుతున్న వైఎస్ షర్మిల అంతకన్నా ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో మొదటి పంప్ హౌస్‌కు మూడు రిజర్వాయర్లను నిర్మించిన సంగతి మరువద్దని సూచించారు. అదేవిధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎంత జరిగిందో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎంత జరిగిందో...? చూడటానికి గత సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బస్సులు పెడతామంటూ చెప్పిన ప్రస్తావన వారు గుర్తు చేశారు. 60 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రజలను పాలించిన కాంగ్రెస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు గురించి ఎందుకు కనుక్కోలేకపోయిందని వారు ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి ఒక ఎత్తైన ప్రదేశం అని మొట్టమొదట గుర్తించింది ముఖ్యమంత్రి కేసీఆర్ అని వారు అన్నారు. ఇక్కడ రిజర్వాయర్ కట్టాలంటే కృష్ణ నది నుంచి నీళ్లు ఎత్తిపోయాలని పేర్కొన్నారు. అందుకోసం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా దీనికి జలాలు అందించాలన్న నిశ్చయంతో ప్రభుత్వం ఈ రిజర్వాయర్లు ఏర్పాటు చేయబోతుందంటూ వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగానే నార్లాపూర్, కరివేనా, ఏదుల, వట్టెం వద్ద రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయని, ఉదండపూర్ వద్ద 80 శాతం పనులు వేగవంతంగా సాగుతున్నాయని అన్నారు. ఒక కాంగ్రెస్ నాయకుడు రెండు సార్లు అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్నిస్తున్నారని 10 సార్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మీరేం చేశారో చెప్పాలని వారు ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర నూతన సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారని వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సీఎం సూచించినట్లు వారు పేర్కొన్నారు. ఉదండాపూర్ తరువాత లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఒకవేళ కృష్ణానదిలో జల కొరత ఏర్పాడితే గోదావరి జలాలు కూడడా వాడుకునేందుకు ప్రత్యామ్నాయంగా పథకాన్ని రూపొందించారని వారు వివరించారు. కాలువల నిర్మాణాలకు సహితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, టెండర్ల కోసం ఇచ్చిన ఉత్తర్వుల వివరాలకు మీడియాకు వివరించారు. బీజేపీ ప్రభుత్వం కృష్ణానది జలాల్లో వాటా ఎందుకు తెల్చడం లేదని వారు ప్రశ్నించారు. ఈ సమస్యను ఇంకా జటిలం చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని, నీటి వాట పంపిణీకి కేంద్రం ఇంత ఆలోచన చేయడం భావ్యమేనా అని అన్నారు. బీజేపపీ అధికారంలోకి వస్తే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామంటున్న బీజేపీ నాయకులు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న విషయాన్ని మర్చిపోయారా..? అని బీఆర్ఎస్ నాయకులు ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాల్సిన బాధ్యత బీజేపీ పై లేదా అని వారు ప్రశ్నించారు. ఈ విలేరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## చల్లా నర్సింహ్మారెడ్డికి నాయకులు సన్మానం

**మొయినాబాద్, మే 23. ప్రభాతవార్త :**
రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డికి రెండవసారి జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికైన సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ సభ్యులు రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో మొయినాబాద్ మండల నాయకులు కలిసి శాలువా పూలమాలలతో సత్కరించి సన్మానించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఖాజాపాష, టీపీసీసీ ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా నాయకులు రాఘవరెడ్డి, మొయినాబాద్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, టీపీసీసీ సోషల్ మీడియా చేవెళ్ల నియోజకవర్గం బురాన్ సురేష్, అజీజ్‌నగర్ గ్రామ అధ్యక్షులు చెంగలి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు బండారి చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఫెరోజ్, యూసుఫ్‌ఖాన్, మండల యువజన ఉపాధ్యక్షులు మోత్కుపల్లి భాస్కర్, మండల యువజన సీనియర్ నాయకులు పులగళ్ల కుమార్, నాగిరెడ్డిగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్ర విజయ్ రాజు, బాకారం కాంగ్రెస్ యువనాయకులు కొండికల్ల చంద్రశేఖర్, అమీర్‌గూడ కాంగ్రెస్ యువజన నాయకులు తదితరులు ఉన్నారు.



చల్లా నర్సింహ్మారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## మంబాపూర్‌లో ప్రమాదవశాత్తు పాడి ఆవు మృతి



మృతిచెందిన పాడి ఆవు

**పెద్దేముల్, మే 23, ప్రభాతవార్త:**
ప్రమాదవాశాత్తు పాడి ఆవు మృతి చెందిన సంఘటన పెద్దేముల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండలలోని మంబాపూర్ గ్రామానికి చెందిన గిడ్డ శ్రీనివాస్ కుటుంబ పోషణకై పాడి ఆవును పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఎప్పటి మాదిరిగా ఆవును మేపడానికి ఇతరుల పోలము వద్ద విడిచి వెళ్ళాడు. ఆవును విడిచి వెళ్లడంతో ఆవు మెడకు తాడు బిగుతై మృతిచెందింది. తాడు బిగుతై మృతి చెందిందా లేదా ఎవరైన ఆవు మెడకు తాడు బిగించి చంపడం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ పోషణకై పెంచుకుంటున్న పాడి ఆవు మృతి చెందడంతో తమకు కుటుంబ పోషణ భారమవుతుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు గిడ్డ శ్రీనివాస్ కోరుతున్నాడు.